క్లుప్తంగా

ఘనంగా రాట మహోత్సవం



తోటాడ కాశీ విశ్వేశ్వర ఆలయంలో పెళ్లిరాట మహోత్సవం

మునగపాక: తోటాడలో పురాతన శైవక్షేత్రం భావనారుషి, కాశీ విశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో శుక్రవారం పెళ్లిరాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 30న సాయంత్రం 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో భావనారుషి, భద్రావతిల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రాట మహోత్సవం నిర్వహించారు. 31న స్వామివారి ఊరేగింపు, పల్లకి సేవ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దొడ్డి ఆదినారాయణ, నూక లక్ష్మీనారాయణ, వీరబాబు, అప్పారావు, జగదీష్, శ్రీధర్, అర్చకులు రాంప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

దేవీతల్లి ఆలయానికి రూ.20వేల విరాళం



విరాళం అందజేస్తున్న భక్తుడు

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో నూతనంగా నిర్మిస్తున్న దేవీతల్లి అమ్మవారి ఆలయానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా వ్యాపారి మొల్లేటి అప్పారావు, సూర్యకాంతం దంపతుల కుమారుడు రామ శివాజీ రూ.20 వేల విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ పల్లె అప్పలనాయుడుకు శుక్రవారం అందజేశారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

పాస్టర్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

- క్రైస్తవ సంఘాల శాంతి ర్యాలీ



వైఎస్సార్ కూడలి వద్ద క్రైస్తవుల మానవహారం

యలమంచిలి రూరల్: సువార్త ప్రసంగీకులు, పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయించాలని కోరుతూ క్రైస్తవ సంఘాలు, మండల పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆయన మృతిపై క్రైస్తవులకు, ప్రజలకు అనేక అనుమానాలున్నాయని, నిష్పక్షపాతంగా విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని పలువురు పాస్టర్లు కోరారు. యలమంచిలి ఆంధ్ర సెంటినరి బాప్టిస్టు సంఘం, వైఎంపీఎఫ్, పట్టణ క్రైస్తవ సమాఖ్యకు చెందిన పాస్టర్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ శాంతి ర్యాలీలో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

గణిత టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న వింగ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

యలమంచిలి రూరల్: గణిత ప్రతిభ పరీక్షలో విజేతలుగా నిలిచిన ఇద్దరు విద్యార్థినులకు వింగ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. వీటితోపాటు జీకే పుస్తకాలను అందజేశారు. మండలంలోని పేటబయ్యవరం ఎంపీయూపీ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ టాలెంట్ నిర్వహించారు. గణితం పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించడానికి ఇలాంటి ప్రతిభ పరీక్షలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బీవీ ధనలక్ష్మి, వింగ్స్ ఫౌండేషన్ కార్యదర్శి ఎం జయప్రకాష్, ఉపాధ్యాయులు పీ రవీంద్ర, జీవీ సూర్యశ్రీ, బీ బాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

మునగపాక ఉప సర్పంచ్ ఎన్నిక మళ్లీ వాయిదా



సభ్యులు రాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

మునగపాక: స్థానిక మేజర్ పంచాయతీ మునగపాక ఉప సర్పంచ్ పదవి ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి, ఈవోపీఆర్డీ ఎం.సోమరాజు తెలిపారు. సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా వేశామన్నారు. ఈ నెల 27న సభ్యులెవరూ ఉప సర్పంచ్ ఎన్నికలో పాల్గొనేందుకు రాకపోవడంతో ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఆ రోజు సభ్యులు హాజరు కాకపోవడంతో డీపీవో శిరీషారాణి దృష్టికి తీసుకెళ్లామన్నారు.

సముద్రపు అలలకు ఎదురొడ్డి, తుపాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలకు ఎదరీది వేట సాగిస్తున్న మత్స్యకారులపై కూటమి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. వేట సాగనిదే పూట గడవని వీరికి బతుకు భరోసా కరువైంది. కాలుష్య కారణంగా మత్స్య సంపద చనిపోవడంతో సుదూర ప్రాంతాలకు వేటకు వెళ్లి మృత్యువాత పడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందక ఇబ్బందులకు గురవుతున్నారు.



రెక్కలు ముక్కలు చేసుకుని వేట సాగిస్తున్న మత్స్యకారులు

నడిసంద్రాన బతుకు పోరాటం

- ప్రాణాలు పణంగా పెట్టి గంగపుత్రుల జీవనం
- కాలుష్యంతో చనిపోతున్న మత్స్య సంపద
- సుదూర ప్రాంతాల్లో వేటకు వెళ్లి మృత్యువాత
- తెరవని సబ్సిడీ డీజిల్ ఆయిల్ బంక్



కాలుష్యం కారణంగా మృత్యువాత పడిన చేపలు

అచ్యుతాపురం రూరల్: జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామమైన పూడిమడకలో 20 వేల జనాభా ఉండగా, 3 వేల నుంచి 4 వేల మంది మత్స్యకారులు మత్స్య సంపదపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి చేపల వేట తప్ప వేరే జీవనాధారం లేదు. రెక్కలు ముక్కలు చేసుకుని తెప్పలు భుజాన వేసుకుని శ్రమిస్తేనే మత్స్యకారులకు ఆ రోజు పూట గడుస్తుంది. సెజ్‌లో పరిశ్రమలు, ఫార్మా కంపెనీల రసాయన వ్యర్థాల కాలుష్యం కారణంగా మత్స్యకారులు సముద్రంలో మత్స్య సంపద కోల్పోతున్నారు. చేపలు పొదగడం అనే ప్రక్రియ సముద్రపు ఒడ్డున జరుగుతుంది. పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థాలు పైపులైన్ ద్వారా సముద్రంలోకి వదలడంతో తీరం వెంబడి చేపలు గుడ్లు పొదిగేందుకు వీలు లేకుండా పోయిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పడవలు, వలలతో నిండుగా పూడిమడక తీరం



వేట అనంతరం ఇంటికి చేరుకుంటున్న మత్స్యకారుడు పుక్కళ్ల ధనరాజు

ఏడాదిగా అందని వేట నిషేధ భృతి

కూటమి ప్రభుత్వం వచ్చి నేటికి ఏడాది గడుస్తున్నప్పటికీ వేట నిషేధ భృతి అందలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపల వేట తప్ప మరో పని చేసుకోవడం తెలియని మత్స్యకారులు వేట నిషేధ సమయం 61 రోజుల్లో జీవనం సాగడం తీవ్ర ఇబ్బందికరంగా ఉండటంతో మత్స్యకారులు పొట్ట పోషణకు అప్పులు చేసుకుని జీవించే పరిస్థితి. అధికారంలోకి వస్తే రూ.10 వేలు ఉండే మత్స్యకార భృతి రూ.20 వేలు చేస్తామని నమ్మి బలికిన కూటమి ప్రభుత్వం నేటికీ మత్స్యకార భృతిపై పెదవి విప్పడం లేదని వాపోతున్నారు.

స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు లేక...

స్థానిక పరిశ్రమల్లో విధులు నిర్వహించేందుకు సరిపడా విద్యార్హతలు ఉన్నప్పటికీ ఇక్కడ మత్స్యకారులకు అవకాశాలు కల్పించడంలేదు. అభ్యసించిన విద్యకు సరైన గుర్తింపు లేకపోవడంతో యువ మత్స్యకారులు వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతై మృత్యువాత పడుతున్నారు. ఇది వరకూ పూడిమడక శివారు కడపాలెం గ్రామానికి చెందిన మేరుగు జగన్ సముద్రంలో చేపల వేటకు వెళ్లి పడవ నుంచి జారిపడి గల్లంతై మృత్యువాత పడ్డాడు. ఇలా మృతి చెందిన మత్స్యకారులకు **ప్రభుత్వం చెల్లించాల్సిన** రూ.10 లక్షల నష్టపరిహారం **నేటికీ చాలా కుటుంబాలకు** అందలేదు. **రెక్కాడితే గాని డొక్కాడని** దుస్థితిలో **మత్స్యకారులు బతుకులీడుస్తున్నారు.** మత్స్యకారుల సమస్యలు **వినిపించుకొనే** నాథుడే కరువయ్యాడని **వాపోతున్నారు. సొంత** లాభాలు చూసుకోవడమే కానీ తమ జీవన విధానంపై సరైన అవగాహన కల్పించి బాగుపడేలా ఆలోచించే నాయకులు లేరని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుడిగుండాల్లో చిక్కుకుని మృత్యువాత...



వేటకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన యువకుడు

తీరానికి సమీపంలో వేట సాగకపోవడంతో సముద్రపు ఒడ్డు నుంచి సుమారు 50 నుంచి 100 కిలోమీటర్లు దూరం వెళ్లి వేట సాగించే పరిస్థితి నెలకొంది. సుదూర ప్రాంతాలకు వెళ్లి వేట సాగించడానికి అధిక ధరకు డీజిల్ ఆయిల్ వెచ్చించి ఇంజిన్ బోట్లుపై మత్స్యకారులు వేటకు వెళ్తారు. కొందరు మత్స్యకారులు కాకినాడ సముద్ర తీరం భైరవపాలెంలో **ఓఎన్జీసీ రిగ్గ్** ఆయిల్ బేష్ కంపెనీ **దగ్గరకు వస్తుంటారు.** ఇక్కడ లైటింగ్ కారణం**గా చేపలు రావడంతో** వలలకు చిక్కుతాయి. **అదే సమయంలో** ఏర్పడే సుడిగుండాల్లో **చిక్కుకుని మృత్యువాత** పడిన సంఘటనలు **ఉన్నాయని చెబుతున్నారు.**

మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలి



ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా మత్స్యకారులను ఎస్టీలో చేర్చి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలన్నీ మత్స్యకారులకు అందేలా చర్యలు తీసుకోవాలి. ఏపీఐఐసీ, బ్రాండిక్స్ పైపులైన్ ప్యాకేజీ సుమారు 1400 మందికి అందలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అందరికీ పరిహారం అందజేస్తామని నేటికీ నోటి మాటలే మిగిలాయి. మూసి వేసిన డీజిల్ ఆయిల్ బంకు తెరిపించి సబ్సిడీపై మత్స్యకారులకు ఆయిల్ అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– చోడిపల్లి అప్పారావు, జిల్లా మత్స్యకార నాయకుడు

రుణాలకు 3 రోజుల్లో 500పైన దరఖాస్తులు



ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో కార్పొరేషన్ రుణాల దరఖాస్తుదారులు

అచ్యుతాపురం రూరల్: వెనుకబడిన తరగతుల వారు ఉపాధి పొందడానికి ప్రభుత్వం విడదల చేసిన కార్పొరేషన్ రుణాల గడువు పొడిగించిన మూడు రోజుల్లో 500పైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపీడీవో ప్రభాకర్ రావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయం ఆవరణలో బ్యాంకర్లకు దరఖాస్తులు అందజేసేందుకు అభ్యర్థులు క్యూ కట్టారు. గడువు పొడిగింపు చేయక ముందు 44 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. గడువు పొడిగించిన మూడు రోజుల వ్యవధిలో 500పైన దరఖాస్తులు చేసుకోవడం గమనార్హం. దీనిపై అధికారులు సరైన అవగాహన కల్పించి ఉంటే మరింత మంది అర్హులు దరఖాస్తులు చేసుకునే వారమని పలువురు నిరుద్యోగ యువకులు వాపోయారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



మౌలానాలను ఘనంగా సత్కరించిన దృశ్యం

కోటవురట్ల: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ఇందులో మసీదులు విద్యుత్ దీపాలంకరణలతో కనువిందు చేస్తున్నాయి. స్థానిక ముస్లిం కాలనీలో మసీద్ ఉస్మాన్ ఘనిలో శుక్రవారం ప్రత్యేక తరావి నమాజ్ భక్తి శ్రద్ధలతో చేశారు. తరావి నమాజ్‌లో పవిత్ర ఖురాన్ పూర్తయిన సందర్భంగా జుమ్మా నమాజ్ చేశారు. అనంతరం బీహార్ రాష్ట్రానికి చెందిన మౌలానా షేక్ ముస్కురాన్, స్థానిక మసీద్ మౌలానా హఫీజ్ అజమత్ రజను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రపంచ శాంతిని కోరుతూ అల్లాహ్‌ను ప్రార్థించారు. కార్యక్రమంలో మసీదు ఉస్మాన్ ఘని కమిటీ సభ్యులు, నవజవాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రీ సర్వేతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు



కిల్లాడ శ్రీనివాసరావు

కోటవురట్ల: భూ రీ సర్వేతో రాష్ట్ర ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బంది పెడుతోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాములవాక గ్రామంలో గత ప్రభుత్వంలోనే భూ రీసర్వే పూర్తి స్థాయిలో జరిగిందన్నారు. అప్పట్లో రైతులు ఎండల్లో సైతం గంటల తరబడి నిలబడి సర్వే చేయించుకున్నారన్నారు. గ్రామంలో 1881.44 ఎకరాల భూమి కాగా, 1411 ఎకరాలు మెట్ట, 337 ఎకరాలు పల్లం, 223 ఎకరాలు ప్రభుత్వ భూమి, 126 ఎకరాలు గ్రామకంఠం ఉన్నాయన్నారు. వీటన్నిటికీ గత ప్రభుత్వంలోనే భూ రీ సర్వే జరిగిందని తెలిపారు. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక రీ సర్వే అంటూ అధికారులు గ్రామసభ పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలోనే రీ సర్వే పూర్తయిందని అధికారులను ప్రశ్నిస్తే, జేసీ లాగిన్‌లో నమోదు కాలేదని, దాంతో మళ్లీ చేస్తున్నామని చెప్పడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యానికి రైతులను బలిచేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పుడు ఎండలు తీవ్ర స్థాయిలో ఉండగా, రీ సర్వే పేరుతో రైతులను ఇబ్బంది పెట్టడం సబబు కాదన్నారు.

నగదు రూపంలో పరిహారం అందించాలి



నిర్వాసితులతో మాట్లాడుతున్న సీఐటీయూ నేత బ్రహ్మాజీ

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు నేరుగా ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చూడాలని సీఐటీయూ నేత ఎస్.బ్రహ్మాజీ కోరారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వాసితులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూడిమడక రోడ్డు విస్తరణలో 1,200 మందికి పైగా బాధితులు ఉన్నారన్నారు. వారందరికీ ప్రభుత్వం టీడీఆర్ బాండ్లు ఇస్తామంటూ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో నిర్వహించిన పలు గ్రామ సభల్లో బాధితులకు మెరుగైన పరిహారంతో పాటు ఖాతాల్లో నగదు జమ చేసేలా చర్యలు తీసుకుంటామంటూ అధికారులు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలన్నారు. స్థానిక శాసనసభ్యుడు సుందరపు విజయకుమార్ ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో శరగడం విష్ణు, విల్లూరి జగన్నాథరావు, టిక్కలి గంగునాయుడు, ఆడారి శ్రీనివాసరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గిరిజన నాయకుడు కోనాల మృతి



శ్రీను (ఫైల్)



శ్రీను కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ గిరిజన నాయకుడు కోనాల శ్రీను శుక్రవారం అనారోగ్యంతో మరణించారు. చీడిక గ్రామానికి చెందిన కోనాల శ్రీను 2014లో స్థానిక సంస్థల ఎన్నికల్లో నక్కపల్లి జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. మైదాన ప్రాంత గిరిజన సమస్యలపై నిరంతరం పోరాటం చేసేవారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ తెలిపారు. ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. శుక్రవారం శ్రీను మృతదేహాన్ని సందర్శించి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. శ్రీను కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఎంపీటీసీ పక్కుర్తి రమణ, మాజీ సర్పంచ్ గండేపల్లి ప్రకాష్ తదితరులు ఉన్నారు.

చూచుకొండ డ్వాక్రా మహిళల సమస్య పరిష్కరించాలి

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి



మాట్లాడుతున్న వరలక్ష్మి

అనకాపల్లి: మునగపాక మండలం చూచుకొండ గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళల సమస్యలు పరిష్కారం కోసం జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి కోరారు. శుక్రవారం స్థానిక దొడ్డి రామనాయుడు భవనంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చూచుకొండ గ్రామంలో డ్వాక్రా మహిళల సమస్యలపై 20 రోజుల క్రితం వెలుగు కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశామన్నారు. అయినప్పటికీ సమస్య పరిష్కరించడంలో విఫలమైనట్లు పేర్కొన్నారు. డ్వాక్రా గ్రూపులో ప్రతి నెలా వాయిదాలు సకాలంలో కట్టలేని ఇద్దరు మహిళలని పిలిపించి సమస్య పరిష్కరిస్తానని చెప్పిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు తులసి, బొడ్డే దివ్య, కాంద్రేగుల లక్ష్మి, కాంద్రేగుల కృష్ణవేణి పాల్గొన్నారు.

'దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి'

అనకాపల్లి టౌన్: మండలంలోని ఉడేరు పంచాయతీ అల్లిఖానుడు పాలెం గ్రామాన్ని జిల్లా జైభీమ్ సేన జిల్లా అధ్యక్షుడు రేబాక మధుబాబు శుక్రవారం సందర్శించారు. ఈ నెల 20న జరిగిన పండుగ సందర్భంగా గూనూరు అప్పారావు, గూనూరు నాగరాజు, గూనూరు లక్ష్మీ భర్త కోటిలపై కుల వివక్షతో దాడి చేశారన్నారు. దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని మధుబాబు కోరారు. కార్యక్రమంలో జిల్లా జైభీమ్ సేన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా నూకాలమ్మ జాతర

- అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు
- ఆలయాల వద్ద రద్దీ



వేంపాడు నూకాలమ్మను దర్శించుకున్న నాయకులు



దేవవరంలో నూకాలమ్మ ఆలయాన్ని దర్శించుకుంటున్న భక్తులు



సర్వసిద్ధిలో శక్తి వేషాలు



వేంపాడు నూకాలమ్మ ఆలయంలో పండ్లతో అలంకరణ



నూకాలమ్మకు బోనాలు సమర్పించిన దృశ్యం

నక్కపల్లి: మండలంలో వేంపాడు, దేవవరం గ్రామాల్లో గ్రామ దేవత నూకాలమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గురువారం తెల్లవార్లూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి జాగరణ నిర్వహించారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి కానుకలు, మొక్కులు, పసుపు కుంకుమలు సమర్పించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మిగిలిన గ్రామాల్లో కొత్త అమావాస్య పండుగను శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నూకాలమ్మ ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. విద్యుద్దీపాలంకరణ చేశారు. వేంపాడు నూకాలమ్మ గర్భాలయంలో వివిధ రకాల పండ్లతో అలంకరించారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నక్కపల్లి, ఉద్దండపురం, గొడిచర్ల, సీహెచ్ఎల్‌పురం, ఉపమాక, చినదొడ్డిగల్లు, తదితర గ్రామాల్లో కొత్త అమావాస్య పురస్కరించుకుని నూకాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

సర్వసిద్ధిలో కొత్త అమావాస్య సందడి

ఎస్.రాయవరం: మండలంలో సర్వసిద్ధి గ్రామంలో కొత్త అమావాస్య వేడుక పురస్కరించుకుని నూకాంబిక ఆలయం వద్ద భారీ జాతర నిర్వహించారు. శక్తి, పులివేషాలు వేసి నృత్యాలు చేశారు. భక్తులు అమ్మవారి ఆలయానికి వచ్చి దర్శనాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పాల్గొన్నారు. శనివారం అమావాస్య పురస్కరించుకుని అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు.

అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నక్కపల్లి: వేంపాడు నూకాలమ్మను కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు తదితరులు శుక్రవారం దర్శించుకున్నారు. ముందుగా మణిరాజు ఇంటి వద్ద అమ్మవారి ఘటాలకు పూజలు చేశారు. అనంతరం ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని కానుకలు సమర్పించుకున్నారు. వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, నాయకులు సురేష్‌వర్మ తదితరులు ఉన్నారు.

సీతారామ కల్యాణోత్సవాల పోస్టర్ విడుదల



కల్యాణ మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి పెదపల్లి సీతారామ ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాల పోస్టర్‌ను గ్రామపెద్దలు శుక్రవారం విడుదల చేశారు. శ్రీరామ నవమి సందర్భంగా ఇక్కడ ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి గ్రామస్తులు నిర్ణయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొద్దపు ఎర్రయ్యదొర, దాసరి కుమార్, కోడిగుడ్డు రమణ, గ్రామ పెద్దలు బొద్దపు నాగేశ్వరరావు, బొద్దపు శ్రీనివాసరావు, పప్పు ఈశ్వరరావు, బొద్దపు రమణ, చిత్త శ్రీను, ఎం ఈశ్వరరావు, బీ ప్రకాష్, బీ తులసీరావు, ఒమ్మి రమణ, ఆలయ ధర్మకర్త బీఎల్ఏ రాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక ఘటాల ఊరేగింపు



మునగపాకలో ఘటాల ఊరేగింపులో భక్తులు

మునగపాక: నూకాంబిక అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమం శుక్రవారం రాత్రి మునగపాకలో ఘనంగా నిర్వహించారు. కొత్త అమావాస్య వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణం నుంచి ప్రారంభమైన ఘటాల ఊరేగింపు గ్రామంలో అన్ని వీధుల మీదుగా ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ మళ్ల రామజగన్నాథం తగు చర్యలు తీసుకున్నారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.